క్లుప్తంగా

జోన్-3 విద్యుత్ ఈఈగా సింహాచలం నాయుడు



బాధ్యతలు చేపట్టిన సింహాచలం నాయుడిని అభినందిస్తున్న డీఈఈలు, ఏఈలు

మధురవాడ: విద్యుత్ శాఖ విశాఖ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బి.సింహాచలం నాయుడు శనివారం బాధ్యతలు చేపట్టారు. మధురవాడలోని జోన్-3 కార్యాలయంలో పనిచేసిన పోలాకి శ్రీనివాసరావు జోన్-1కు బదిలీ కావడంతో, ఆయన స్థానంలో సింహాచలం నాయుడు బాధ్యతలు చేపట్టారు. ఆయన్ను జోన్-3 పరిధిలోని భీమిలి, విశాఖ తూర్పు, విశాఖ పశ్చిమ, పెందుర్తి నియోజకవర్గాల పరిధిలోని ఏఈలు, డీఈఈలు పలువురు సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందజేసి, ఘనంగా సత్కరించారు.

జీవో 30 అమలుకు వినతి



తహసీల్దారు రామారావుకు వినతిపత్రం అందిస్తున్న రెండోవార్డు ప్రజలు

భీమునిపట్నం: జీవో నంబర్ 30ని అమలు చేయాలని కోరుతూ భీమిలి రెండో వార్డు సబ్బి వీధికి చెందిన పలువురు తహసీల్దారు రామారావును కోరారు. సీపీఎం జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్‌ను కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ తాము అనేక సంవత్సరాలుగా ఇక్కడ స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకుని ఉంటున్నామని, ఇందులో సరైన సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం నిరుపేదలకు వారు ఉంటున్న ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరణ చేస్తానని ప్రకటించిన జీఓ 30ని తమకు అమలుచేయాలని కోరారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

మధురవాడ: వృద్ధులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మధురవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి దీపిక సూచించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా కృష్ణా నగర్‌లోని వైజాగ్ ఓల్డేజ్ హోంలో శుక్రవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. 60ఏళ్లు పైబడిన 35 మందికి కఫ పరీక్షలు చేశారు. టీబీ, ఇతర వ్యాధుల నుంచి తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఆరోగ్య పరిరక్షణకు రోజూ వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి పరమేశ్వరరావు, టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ నిధులతో పది గ్రామాల్లో బోరు బావులు



పద్మనాభంలో బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు కోటాలో మంజూరైన రూ.15 లక్షల జెడ్పీటీసీ నిధులతో పది గ్రామాల్లో బోరు బావులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీపీ కంటుబోతు రాంబాబు తెలిపారు. పద్మనాభంలో బోరు బావి నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ బోరు బావుల ఏర్పాటుతో తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు.

15న మద్దిలో ముత్యాలమ్మ ఉత్సవం



పద్మనాభం: మండలంలోని మద్దిలో ఈ నెల 15వ తేదీన ముత్యాలమ్మ ఉత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవ నిర్వహణ గురించి ఆదివారం గ్రామంలో చాటింపు వేస్తారు. అమ్మవారి ప్రతిరూపమైన వేప చెట్టు వద్ద పూజలు చేస్తారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు చెల్లించి, మొక్కులు చెల్లించుకుంటారు.



ఫెన్సింగ్ తొలగించి ఏర్పాటు చేసిన సామగ్రి



గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో ప్రస్తుత పరిస్థితి

గ్రీన్ బెల్ట్ ధ్వంసం

- ఎండాడ జంక్షన్ నుంచి దిశ పోలీస్‌స్టేషన్ వరకు ఇదే పరిస్థితి
- పచ్చని మొక్కలు తొలగించి నిర్మాణ సామగ్రి డంప్
- ఫెన్సింగ్ తొలగింపు



చెట్లు నరికి డంప్ చేసిన ఇటుక

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతం డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. జాతీయ రహదారిపై వెళ్లే వాహనాల కాలుష్యం తగ్గించేందుకు, వాతావరణ సమతుల్యత కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం గతంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో ఎండాడ జంక్షన్ సిగ్నల్ పాయింట్ నుంచి వరాహగిరినగర్ మీదుగా దిశ పోలీస్‌స్టేషన్ వరకు కిలోమీటర్ మేర పచ్చని మొక్కలు ఏర్పాటు చేసి, నిత్యం సంరక్షించేవారు. రక్షణ కోసం ఈ గ్రీన్ బెల్ట్ చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. పరుచుకున్న పచ్చదనంతో నందనవనంలా ప్రయాణికులకు, స్థానికులకు నీడను, మంచిగాలిని, ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేది.

పచ్చదనం కనుమరుగు

ప్రస్తుతం ఈ గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో మొక్కలు, చెట్లు కనుమరుగైపోయాయి. వాటి సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ తొలగించేశారు. ఎక్కడ చూసినా ఎండిన చెట్లతో, కళావిహీనంగా దర్శనమిస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాంతమంతా డంపింగ్ యార్డ్‌లా మారిపోయింది. కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం ఈ గ్రీన్ బెల్ట్‌ను పూర్తి స్థాయిలో ధ్వంసం చేసేశారు.

ప్రస్తుతం ఈ గ్రీన్ బెల్ట్ ప్రాంతం సమీపంలో జోరుగా నిర్మాణాలు జరుగుతుండటంతో, యజమానులు వీటి ఎదురుగా ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని తమ నిర్మాణ సామాగ్రి నిల్వ చేసుకునేందుకు స్థావరంగా వాడుతున్నారు. అక్కడి మొక్కలను, చెట్లను నరికేసి ఇటుక, ఇసుక, రాయి, సిమెంట్, ఐరన్ వంటి నిర్మాణ సామగ్రిని నిల్వ చేసుకుంటున్నారు. అదీ చాలదన్నట్లు పాత బిల్డింగుల డెబ్రిస్‌ను కూడా ఇదే ప్రాంతంలో డంప్ చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

ఇదంతా సచివాలయానికి సమీపంలో, ప్రధాన రహదారిని ఆనుకుని జరుగుతున్నా, జీవీఎంసీ, రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. పచ్చని వాతావరణాన్ని నాశనం చేసి డంపింగ్ యార్డ్‌లా మారుస్తున్నా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఫిర్యాదు చేసినా..

గ్రీన్ బెల్ట్ ఆక్రమణపై ఇటీవల జోన్-2 జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మికి ఫిర్యాదు చేసినా ఒక్కసారి పర్యటనతో మమ అనిపించేశారు. గ్రీన్ బెల్ట్ ధ్వంసం చేసినవారికి నోటీసులు ఇవ్వడం కానీ, వారిపై చర్యలు తీసుకోవడం కానీ ఎక్కడా కనిపించలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, పచ్చదనాన్ని హరించేవారిపై కఠిన చర్యలు తీసుకుని గ్రీన్ బెల్ట్‌కు పూర్వ వైభవం వచ్చేలా ప్రణాళిక రూపొందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో పిక్క, ఇసుక

అధికారులు చర్యలు తీసుకోవాలి



గ్రీన్‌బెల్ట్‌ను నిర్మాణ సామగ్రి నిల్వ ఉంచే ప్రాంతాలుగా మార్చేశారు. దారి పొడవునా ఇదే పరిస్థితి. గ్రీన్ బెల్ట్‌ను ధ్వంసం చేసే అధికారం వారికి ఎవరిచ్చారు. పచ్చని మొక్కలు నరికేస్తుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావట్లేదు. వెంటనే నిర్మాణాలు నిలిపివేసి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి.

– జి.బాలకృష్ణ, స్థానికుడు

కఠిన చర్యలు తీసుకుంటేనే కాపాడుకోగలం



మొక్కలు నాటండి పర్యావరణాన్ని పరిరక్షించండి అంటూ ఉపన్యాసాలు ఇస్తున్నారు. కానీ అవి కార్యరూపం దాల్చడం లేదు. గ్రీన్ బెల్ట్‌ను ధ్వంసం చేస్తుంటే అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు? వారి తీరు మారకుంటే ఇలాంటి అనర్థాలు ప్రతీ ప్రాంతంలో జరుగుతాయి. నిర్మాణం పేరుతో గ్రీన్ బెల్ట్ ధ్వంసం చేసిన వారి నిర్మా ణ అనుమతులను రద్దు చేయాలి. కఠిన చర్యలు తీసుకుంటే తప్ప గీన్ బెల్ట్ ప్రాంతాలను రక్షించుకోలేం.

– సింహాచలం, స్థానికుడు

ఇలాగేనా శిథిల భవనాల తొలగింపు?

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్, ఎండాడ, రుషికొండ ప్రాంతాల్లో మూడు చోట్ల శిథిలావస్థకు చేరుకున్న తుఫాన్ రక్షిత భవనాల తొలగింపు ప్రక్రియను ఇటీవల ప్రారంభించారు. ఒక్కో భవనం తొలగింపునకు రూ. 3 లక్షల వ్యయం కూడా నిర్ణయించారు. అయితే భవనాన్ని తొలగించి, శిథిలాలను పూర్తి స్థాయిలో తరలించడంలో అధికారులు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారు. ఏదైనా శిథిల భవనాన్ని తొలగించేప్పుడు ఒక అధికారి పర్యవేక్షణ తప్పనిసరి. భవనాన్ని పూర్తి స్థాయిలో తొలగించి, ఎవరికీ ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఆ అధికారి చూడాలి. అయితే, మూడు రోజుల క్రితం చిన్న రుషికొండ కూడలి వద్ద శిథిలావస్థకు చేరుకున్న తుఫాన్ భవనాన్ని నేలమట్టం చేశారు. కానీ ఆ శిథిలాలను అక్కడే వదిలేయడంతో ఒక్కొక్కటిగా రోడ్డుపై పడుతున్నాయి. ఈ రోడ్డును అనుకుని చిన్న టిఫిన్ సెంటర్లు, ఆటోలు, ఇతర వాహనాలు నిలుపుతారు. నిత్యం వందలాది మంది ఇటుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.



రోడ్డుపైకి జారిపడుతున్న శిథిలాలు

ఆదర్శనగర్‌లో వీధిదీపాల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: ఎట్టకేలకు జీవీఎంసీ భీమిలి జోన్ ఆదర్శనగర్‌లో వీధిదీపాలను పునరుద్ధరించారు. ఇటీవల ఈ ప్రాంతంలో వీధిదీపాలు వెలగక చీకటి అలముకోవడంతో నెలరోజులుగా ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ చీకటి కారణంగా దొంగలు, విషపురుగుల సంచారం పెరిగి, ఇక్కడివారు భీతిల్లుతుండేవారు. దీంతో 'ఆదర్శనగర్‌లో అంధకారం' శీర్షికతో గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ విభాగ అధికారులు స్పందించారు. ఆదర్శనగర్‌లో అంధకారం ఉన్న చోట వీధిదీపాలను పునరుద్ధరించారు.



వీధిదీపాల వెలుగులో ఆదర్శనగర్

విద్యార్థులకు స్టీల్‌కంచాల అందజేత



స్టీల్ కంచాలతో విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం అమనాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పద్మనాభం మండలం రెడ్డిపల్లికి చెందిన సాయి సంహిత ట్రస్ట్ ఆధ్వర్యంలో 60 స్టీల్ కంచాలు అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ప్రధానకార్యదర్శి మాదిరెడ్డి సంతోషి విద్యార్థులకు శుక్రవారం వీటిని అందజేశారు. ట్రస్ట్ సేవలను ఎంపీపీ దంతులూరి వాసురాజు, సర్పంచ్ దంతులూరి ఉమాదేవి అభినందించారు. గ్రామ ప్రతినిధులు చుక్క చిట్టిబాబు, చుక్క ఆదిరెడ్డి, డి.నరసింహమూర్తిరాజు, కంబవు శివ, మరగడ రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం 3.30కే సచివాలయం మూసివేత

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో సచివాలయాన్ని మధ్యాహ్నం 3.30 గంటలకే మూసివేయడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో, వ్యక్తిగత పనుల కోసం ఇక్కడి సచివాలయానికి ప్రజలు శుక్రవారం పదుల సంఖ్యలో వచ్చారు. సాయంత్రం 5 గంటల వరకు తెరిచే ఉంటుందని వచ్చిన ప్రజలు, మధ్యాహ్నం 3.30 కే మూసివేసి ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. ఉదయం కూడా 10 గంటలకు రావలసిన సిబ్బంది 11 గంటలకు వస్తున్నారని తెలిపారు. దీనిపై జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మిని వివరణ కోరగా సచివాలయాన్ని 3.30 గంటలకు మూసివేయడం తమ దృష్టికి వచ్చిందని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మధ్యాహ్నం 3.30 గంటలకు మూసివేసిన సాగర్‌నగర్ సచివాలయం

విద్యుత్ స్మార్ట్ మీటర్లతో ప్రజలపై పెనుభారం

తగరపువలస: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గృహాలకు స్మార్ట్ మీటర్ల బిగింపు, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న భారాన్ని రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహమాన్ డిమాండ్ చేశారు. గుజ్జు రాముసాయుడు భవన్‌లో శుక్రవారం నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత చార్జీల పెంపును వ్యతిరేకించిన చంద్రబాబు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంధన కొనుగోలు సర్దుబాబు చార్జీల పేరుతో సామాన్యుల నడ్డి విరుస్తున్నారన్నారు. అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను కూడా రద్దు చేసుకోవాలన్నారు. ఏడాది కాలంలోనే నాలుగుసార్లు వినియోగదారులపై రూ.15,485 కోట్ల విద్యుత్ భారాలు మోపిన చంద్రబాబు స్మార్ట్ మీటర్ల బిగింపు పేరుతో ప్రజలను హడలెత్తిస్తున్నారన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్ల బిగింపును ఉప సంహరించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, భీమిలి ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, చిల్ల నరసింహులు, చిల్ల రాంపైడి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రెహమాన్

వేములవలస కూడలిలో ట్రాఫిక్‌కు అంతరాయం

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస మార్కెట్ కూడలిలో శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. విశాఖ నుంచి, తగరపువలస వైపు నుంచి, పెందుర్తి నుంచి వచ్చే వాహనాలు ఫ్లై ఓవర్ కూడలిలో నిలిచిపోయాయి. ఈ కూడలిలో వాహనాల రాకపోకలకు తరచూ అంతరాయం కలుగుతోంది. గతంలో విశాఖ నుంచి తగరపువలస వైపు వచ్చే వాహనాలు నేరుగా జాతీయరహదారి మీదుగా, పెందుర్తి నుంచి తగరపువలస, తగరపువలస నుంచి పెందుర్తి వైపు వాహనాలు ఒకదానికి ఒకటి సంబంధం లేకుండా వెళ్లిపోయేవి. ప్రస్తుతం వేములవలస కూడలి వద్ద నిర్మించిన ఫ్లై ఓవర్లు, అనంతరం వేములవలస కూడలి మీదుగా వాహనాలు మళ్లించడం తరచూ సమస్యగా మారుతోంది. పాత పద్ధతిలో తగరపువలస నుంచి వేములవలస ఫ్లై ఓవర్ మీదుగా విశాఖ వెళ్లినట్లే, విశాఖ నుంచి వేములవలస ఫ్లై ఓవర్ మీదుగా తగరపువలస వైపు వాహనాలు వెళ్లేలా హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వేములవలస కూడలి మీదుగా వాహనాల మళ్లింపు లోపాలమయంగా ఉన్నందున తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని మండల ప్రజలు అంటున్నారు.



వేముల వలస కూడలిలో ఇరువైపులా నిలిచిపోయిన వాహనాలు



ఫ్లై ఓవర్ కింద నిలిచిపోయిన వాహనాలు

జనాభా పెరుగుదల, సవాళ్లపై పోటీలు

- డైట్‌లో జిల్లా స్థాయిలో నిర్వహణ
- 20 పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న మధురవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి దీపిక

భీమునిపట్నం: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమిలిలోని జిల్లా విద్య శిక్షణ సంస్థ(డైట్) వద్ద శుక్రవారం జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. జిల్లాలోని 20 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ పర్యవేక్షణలో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వీరిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.1200, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.1000, తృతీయ స్థానం పొందిన వారికి రూ.750 చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

విజేతలు వీరే..

చిత్రలేఖన పోటీల్లో ప్రకాశరావు పేటకు చెందిన బి.ధనుష్ ప్రథమ, చిట్టివలసకు చెందిన కె.వినీల ద్వితీయ, బుచ్చెంపేటకు చెందిన ఇ.లలిత తృతీయ స్థానంలో నిలిచారు. వ్యాసరచన పోటీల్లో చిట్టివలసకు చెందిన ఆర్.కార్తిక్ ప్రథమ, బుచ్చెంపేటకు చెందిన ఎస్.భాగ్యశ్రీ ద్వితీయ స్థానం, ప్రకాశరావు పేటకు చెందిన ఎస్.వివంజలిన్ తృతీయస్థానంలో నిలిచారు. వీరికి ప్రిన్సిపాల్ సుధాకర్ నగదు బహుమతులను అందించి, అభినందించారు. విజేతలు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



నగదు బహుమతులు పొందిన విద్యార్థులు, అధ్యాపకులు

మధురవాడలో ర్యాలీ

మధురవాడ: ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబం ఆనందమయమని మధురవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి దీపిక అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మధురవాడలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య పద్ధతులు పాటించడం వల్ల తల్లీపిల్లలు ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మీనాకుమారి, పర్యవేక్షణాధికారి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనాభా సమస్యను ఎదుర్కోవాలి

భీమునిపట్నం: పెరుగుతున్న జనాభా సమస్యను అందరూ ఎదుర్కోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జనాభా పెరుగుదల వల్ల అనేక సమస్యలు ఏర్పడతాయన్నారు. వాటిని పరిస్థితులను బట్టి అందరూ సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పార్లమెంట్



ఎన్నికైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న పాఠశాల యాజమాన్యం

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాలలో శుక్రవారం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఓటింగ్ విధానం ద్వారా విద్యార్థులు ఎస్పీఎల్‌ను ఎన్నుకున్నారు. పాఠశాలలో ఎన్నికల వాతావరణం ఏర్పాటు చేసి బ్యాలెట్ పేపర్లు ముద్రించి విద్యార్థులు ఓటు వేసేలా ప్రోత్సహించారు. స్కూల్ కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలతో పాటు ప్రజాస్వామ్యం గురించి ఎన్నికల విధానంపై విద్యార్థులకు అవగాహన కలిగించామన్నారు. ఎన్నికల అధికారులుగా పైడిరాజు, పార్వతి, మణి, కోమలి తదితర ఉపాధ్యాయులు వ్యవహరించారు.

సాగునీటి కాలువలోకి నీరు విడుదల

పద్మనాభం: మండలంలోని మద్ది సమీపాన గోస్తని నదిలో ఉన్న ఆనకట్టలో నుంచి పాండ్రంగి దివాన్జీ కాలువలోకి శుక్రవారం నీరు విడుదల చేశారు. దివాన్జీ కాలువ అధ్యక్షుడు ఆర్.ఎస్.రవి కుమార్ రాజు ముందుగా పూజ చేసి, నీటిని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పాండ్రంగి, గొట్టిపల్లి, తాటి చెరువుల కింద ఆయకట్టు సాగు చేయడానికి ఈ నీరు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గొట్టిపల్లి మాజీ సర్పంచ్ కోరాడ వెంకట నరసింహనాయుడు, కర్రోతు వెంకటరమణ, మహంతి అప్పల రమణ పాల్గొన్నారు.



కాలువలో నీటి విడుదలకు పూజ చేస్తున్న రవికుమార్

పాచిమెట్టపై రేషన్ డిపో ఏర్పాటు చేస్తాం

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు పాచిమెట్టపై రేషన్‌డిపో ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్థానికులకు హామీ ఇచ్చారు. రూ.56 లక్షల జీవీఎంసీ సాధారణ నిధులతో గణేష్ థియేటర్, శ్రీబాసర లే అవుట్, పాచిమెట్టలో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పాచిమెట్టలో ఎందరు ఆటంకాలు కలిగించినా రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. భీమిలి తహసీల్దార్ పైల రామారావు, జెడ్పీ ఒమ్మి అయ్యప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

కోల్‌ఫీల్డ్స్ అధికారులకు ఐఐఎంవీలో ముగిసిన శిక్షణ

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎం విశాఖపట్నం (ఐఐఎంవీ)లో మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్‌కు చెందిన 21 మంది అధికారులకు నిర్వహించిన అభివృద్ధి శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక వాతావరణంలో అనుకూల నాయకత్వం ఆవశ్యకతను వివరించారు. ప్రభుత్వ రంగంలో భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే నాయకులను తీర్చిదిద్దేందుకు ఐఐఎంవీ చేస్తున్న కృషిని అభినందించారు. నిర్వహణ సామర్థ్యాలను, నాయకత్వ ప్రభావాన్ని బలోపేతం చేయడమే ఐఐఎంవీ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ శిక్షణలో నెగోషియేటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, కార్పొరేట్ ఫైనాన్స్, జెండర్ సెన్సిటైజేషన్, నాయకత్వ దృక్పథాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రోగ్రాం డైరెక్టర్లు ప్రొఫెసర్లు ఎంపీ అనురాధ, బిషాఖా మజుందార్ తదితరులు పాల్గొన్నారు.



మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ అధికారులకు శిక్షణ ఇస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

పీఎం పాలెం ఎస్‌ఐగా నాయుడు

పీఎం పాలెం: పీఎం పాలెం లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌ఐగా బీఆర్ నాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లా కొత్తకోట మండల పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ పనిచేస్తున్న ఆయన ఎస్‌ఐగా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ పై అధికారుల ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

